క్లుప్తంగా

సింధూరం వెంకటేశంకు అవార్డు



వెంకటేశ్‌ను సన్మానిస్తున్న సేవా సమితి సభ్యులు

దౌల్తాబాద్: సురాయిపల్లికి చెందిన సింధూరం వెంకటేశ్ తెలంగాణ సారస్వత సాహితీ కళా సేవా సమితి నుంచి కవి, రచయిత విభాగంలో అవార్డు అందుకున్నారు. విజయదశమి పురస్కారాల్లో భాగంగా ఆయనను అవార్డుతో పాటు శాలువాతో సత్కరించారు. ఈ అవార్డు తన బాధ్యతను పెంచిందని వెంకటేశ్ తెలిపారు.

మాంసం విక్రయిస్తే కఠిన చర్యలు

పరిగి: మున్సిపల్ పరిధిలో గురువారం మాంసం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య హెచ్చరించారు. మాంసం విక్రయ దుకాణదారులకు బుధవారం నోటీసులు జారీ చేశారు. గాంధీ జయంతి సందర్భంగా జంతువధ, మాంసాన్ని విక్రయించడం నిషేధం అని చెప్పారు. మాంసం విక్రయదారులు తమ దుకాణాలను మూసి వేయాలని సూచించారు. అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నష్ట పరిహారం అందించాలి

పరిగి: అధిక వర్షాల కారణంగా పంటలు పూర్తి దెబ్బతిన్నాయని, రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని తెలంగాణ కిసాన్ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు అందె విజయ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వర్షాల కారణంగా ఎక్కువ శాతం పత్తి, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయన్నారు. దెబ్బతిన్న పంటలకు ప్రతి ఎకరానికి రూ.50 వేలు పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. నష్టపరిహారం చెల్లించకుంటే తెలంగాణ కిసాన్ సంఘం రైతుల కోసం పోరాటం చేస్తుందని హెచ్చరించారు.

జిల్లా ఆస్పత్రిలో రక్తదానం



రక్తదానం చేస్తున్న యూత్ సభ్యుడు

తాండూరు: స్థానికంగా ఉన్న జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో బుధవారం జాతీయ రక్తదాన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని జై భవాని యూత్ అసోసియేషన్ సభ్యులు రక్తనిధి కేంద్రంలో స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అనంతరం యూత్ ప్రతినిధి వినోద్ కుమార్ మాట్లాడుతూ.. అన్ని దానాల కన్నా రక్తదానం గొప్పదని, ప్రాణాపాయ స్థితితో ఉన్న ఒక మనిషి ప్రాణం కాపాడాలంటే రక్తదానంతోనే సాధ్యమవుతోందన్నారు. కార్యక్రమంలో యూత్ అసోసియేషన్ సభ్యులు, రక్తనిధి కేంద్రం వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నయా కల్చర్.. వేడుక అదుర్స్



ఒకే రకం చీరలు ధరించి బతుకమ్మ సంబురాల్లో అతివలు

- ఒకే రకం చీరలు ధరిస్తూ బతుకమ్మ సంబురాలు
- ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్న మహిళలు
- మారుతున్న పల్లెవాసుల అభిరుచులు



కోలాటం ఆడుతున్న మహిళలు

దుద్యాల్: వేడుక ఏదైన సరే మగువలు ఉంటేనే నిండుతనం ఉట్టి పడుతోంది. అలాంటిది బతుకమ్మ పండుగ వచ్చిందంటే చాలు ఆడపడుచులతో గ్రామాలన్నీ కళకళలాడుతుంటాయి. తెలంగాణ ఆడబిడ్డలు పిల్లాజెల్లలతో కలిసి రంగు రంగుల తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి ఆనందంగా జరుపుకొంటారు. ఈ క్రమంలో అతివలు ఆకర్షణీయంగా కనిపించేందుకు కొత్త ధోరణిని అనుసరిస్తున్నారు. ఒకే రకం చీరలు(డ్రెస్ కోడ్) ధరించి బతుకమ్మ ఆడుతున్నారు. ఒకప్పుడు పట్టణాలకే పరిమితమైన ఈ పోకడ ప్రస్తుతం మారుమూల పల్లెలకు సైతం పాకింది. రంగురంగుల చీరలు ధరించి సినిమా పాటల మారిది బతుకమ్మ పాటలతో ఆడుతున్నారు. డీజే చప్పుళ్లు సైతం వేడుకను మరింత ఉత్తేజ భరితంగా మారుస్తున్నాయి.

తీరొక్క పూలతో బతుకమ్మ

ప్రకృతిలో లభించే రకరకాల పూలతో బతుకమ్మను మహిళలు తమ ఇంట్లో పేర్చుతారు. అక్కడే గౌరమ్మకు ప్రత్యేకించి పూజలు చేస్తారు. బతుకమ్మను తయారు చేసి గల్లీ మహిళంతా ఒకచోట చేరి ప్రధాన కూడళ్ల వద్ద బతుకమ్మను పెట్టి పాటలు పాడుతూ.. చప్పట్లు కొడుతూ సాగనంపుతారు.

ట్రెండింగ్‌లో పాటలు

బతుకమ్మ పండుగను మహిళలంతా కలిసి ఒక చోటుకు చేరి జరుపుకొంటారు. నాటి కాలంలో స్త్రీలు స్వయనా పాటలు పాడుతూ.. చప్పట్లు కొడుతూ బతుమ్మ సంబురాలు జరుపుకొనేవారు. అప్పటి పాటల్లో సంపూర్ణమైన అర్థం, లయ, ఒక పద్ధతి అనేది ఉండేది. వినడానికి సైతం చెవులకు వినసొంపుగా ఉండేవి. అప్పటి పాటలే నేడు జానపద పాటల రూపంలో ట్రెండింగ్ అవుతున్నాయి.

నేడు డీజే చప్పుళ్లు

నాటికి.. నేటికి పల్లెల్లో చాలా మార్పులు చోటు చేసుకున్నాయి. ప్రస్తుతం డీజే పాటలు పెడుతూ.. కోలాటాలు ఆడుతూ సంబురాల్లో మునిగి తేలుతున్నారు. అవే కాకుండా డీజే పాటలకు డ్యాన్స్‌లు చేస్తూ బతుకమ్మ సంబురాలు జరుపుకొంటున్నారు. ఇదంతా గతంలో పెద్ద పెద్ద పట్టణాల్లో ఉండేది. దాండియా పేరుతో డీజేలు పెట్టుకుని పట్టణాల్లో మాత్రమే ఆడేవారు. అదికాస్త జానపద నృత్యాల పేరుతో పల్లెకు చేరింది. ప్రస్తుతం గ్రామాల్లో సైతం పెద్ద ఎత్తున మహిళలు ఈ ధోరణి కొనసాగుతుంది.

ఘనంగా శ్రీవారి రజతోత్సవాలు



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

అనంతగిరి: వికారాబాద్‌లోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో రజతోత్సవాల్లో భాగంగా బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచే అర్చనలు, అభిషేకాలు చేశారు. స్వామి వారికి కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులు వడి బియ్యం పోసి తమ మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. రాత్రికి ఆలయ మాడ వీధుల్లో స్వామి వారిని వాహనంపై ఊరేగించారు. అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు) సుధీర్ స్వామివారిని దర్శించుకున్నారు.



కల్యాణ శోభలో స్వామివారు



శ్రీవారి సేవలో అడిషనల్ కలెక్టర్ సుధీర్

బంకమట్టితో మాత విగ్రహం

ఊటుపల్లి యువకుడి అద్భుత ప్రతిభ



రాములు



అలంకరణలో దుర్గామాత విగ్రహం

దోమ: కళా, నైపుణ్యం కలిగి ఉంటే ఏదైన సాధించవచ్చని మండల పరిధిలోని ఊటుపల్లి గ్రామానికి చెందిన బండి రాములు నిరూపించాడు. నల్లమట్టి(బంకమట్టి)తో దుర్గామాత విగ్రహాన్ని అద్భుతంగా తయారు చేశాడు. చిన్ననాటి నుంచి బొమ్మలు గీస్తూ విగ్రహాల తయారీ నేర్చుకున్నాడు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గామాత విగ్రహాన్ని తన పొలంలోని మట్టిని తెచ్చి తయారీ చేసి అందంగా అలంకరించడంతో గ్రామస్తులు ఆశ్చర్యానికి గురయ్యారు. ఈ సందర్భంగా బుధవారం పలువురు అభినందనలు తెలిపారు.

పీహెచ్‌సీలో బతుకమ్మ సంబరాలు



బంట్వారం: కోట్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ మేఘన మాట్లాడారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను చాటి చెప్పేదే బతుకమ్మ పండుగ అన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు అంజలి, అపర్ణ, నర్సమ్మ, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తాచాటాలి



మాట్లాడుతున్న అవినాశ్‌రెడ్డి

షాబాద్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ సత్తా చాటాలని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పట్నం అవినాశ్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాన్నున స్థానిక ఎన్నికలపై దిశానిర్దేశం చేశారు. బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలు సత్తాచాటాలని, కష్టపడే ప్రతీ కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందని తెలిపారు. ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

రిజర్వేషన్లలో ఎస్సీలకు అన్యాయం

కొత్తూరు: ఎంపీటీసీ వ్యవస్థ ఏర్పాటు నుంచి నేటివరకు ఇన్ముల్‌నర్వలో ఉన్న ఎస్సీలకు రిజర్వేషన్‌లలో అన్యాయం జరుగుతోందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నర్సింలు బుధవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. గ్రామంలో సుమారు 800 ఎస్సీ కుటుంబాలు, 550కి పైగా ఓటర్లు ఉన్నప్పటికీ ఎందుకు ఎంపీటీసీ స్థానాన్ని కేటాయించడం లేదని అధికారులను ప్రశ్నించారు. ఏ ప్రాతిపదికన రిజర్వేషన్లు ఖరారు చేశారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గ్రామంలో ఎస్సీలు జనాభా, ఓటర్ల పరంగా అధికంగా ఉన్నప్పటికీ రిజర్వేషన్లు మాత్రం దక్కడం లేదని వాపోయారు.

ముగిసిన క్రికెట్ టోర్నీ

కడ్తాల్: పరిధి చరికొండలో గాదమోని విజేందర్‌గౌడ్ స్మారకార్థం మూడు రోజులుగా నిర్వహించిన మండల స్థాయి క్రికెట్ పోటీలు బుధ వారం ముగిశాయి. ఈ సందర్భంగా విజేత పోలే అర్జున్‌టీం, రన్నరఫ్ భీష్మాచారి జట్లకు విజేందర్‌గౌడ్ బాల్యమిత్రులు నగదు బహుమతితో పాటు, జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో టోర్నీ స్పాన్సర్స్ శేఖర్ నాయకులు పాల్గొన్నారు.

పనులు చేయరు.. స్పందించరు

మున్సిపల్ కమిషనర్‌ను నిలదీసిన పెద్దమంగళారం గ్రామస్తులు



పెద్దమంగళారంలో కమిషనర్ ఖాజామొయిజుద్దీన్‌ను నిలదీస్తున్న గ్రామస్తులు

మొయినాబాద్: ఆరు నెలలకుపైగా వీధి దీపాలు లేవు.. మురుగు కాలువల్లో చెత్తాచెదారం నిండిపోయినా పట్టించుకోరు.. రోడ్లు గుంతల పడ్డా పట్టదు.. ఫోన్ చేస్తే స్పందించరు.. మున్సిపల్ అధికారులు ఏం పనిచేస్తున్నారంటూ కమిషనర్ ఖాజామొయిజుద్దీన్‌పై పెద్దమంగళారం గ్రామస్తులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మున్సిపాలిటీ పరిధిలోని పెద్దమంగళారంలో బుధవారం సద్దుల బతుకమ్మ వేడుకలు నిర్వహించేందుకు మున్సిపల్ అధికారులు ఎలాంటి ఏర్పాట్లు చేయకపోవడంతో మాజీ సర్పంచ్ నరోత్తంరెడ్డితో పాటు గ్రామస్తులు మున్సిపల్ కమిషనర్‌కు ఫోన్ చేశారు. దీంతో ఆయన అక్కడికి చేరుకోవడంతో స్థానికులు ఒక్కసారిగా కమిషనర్‌ను నిలదీశారు. గ్రామంలో వీధి దీపాలు లేవని.. దసరా పండుగ సందర్భంగా వీధి దీపాలు వేయాల్సి ఉన్నా మున్సిపల్ అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. గ్రామంలో మురుగు కాలువలు నిండిపోయి దుర్వాసన వస్తున్నా పట్టించుకోవడంలేదని ఆరోపించారు. మున్సిపల్ అధికారులు సమస్యలు పట్టించుకోకుండా అక్రమ నిర్మాణాల పేరుతో వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. బతుకమ్మ ఏర్పాట్లతో పాటు గ్రామంలో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని.. మురుగు కాల్వలు, వీధులు శుభ్రం చేయాలని డిమాండ్ చేశారు. గ్రామంలో పరిసరాలు పరిశుభ్రం చేయడంతో పాటు వీధి దీపాలు ఏర్పాటు చేస్తామని, బతుకమ్మ వేడుకల నిర్వహణకు తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు చెప్పి పనులు మొదలు పెట్టడంతో గ్రామస్తులు శాంతించారు. సాయంత్రానికి బతుకమ్మ వేడుకలకు సంబంధించి ఏర్పాట్లు చేశారు.

రోడ్లు అధ్వానం.. ప్రయాణం నరకం

బంట్వారం, కోట్‌పల్లి మండలాల పరిధిలో రోడ్లన్నీ అధ్వాన స్థితికి చేరుకున్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మరమ్మతులకు గురయ్యాయి. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- భారీ వర్షాలకు తెగిన రహదారులు
- పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు



నూరుల్లాపూర్ వాగు దగ్గర రోడ్డు దుస్థితి



కొత్తపల్లి చెరువు సమీపంలో రోడ్డుపై గుంత

బంట్వారం: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు బంట్వారం మండలంలోని నూరుల్లాపూర్ వాగు వరద ఉధృతికి రోడ్డు తెగిపోయింది. వారం రోజులు కావస్తున్నా సంబంధిత ఆర్‌అండ్‌బీ అధికారులు మాత్రం కనీస మరమ్మతులు కూడా చేపట్టడం లేదు. దీంతో ద్విచక్రవాహనాలు మినహా ఆటోలు వెళ్లడం కష్టంగా మారింది. బైకులపై వెళ్లేవారు రాత్రి వేళ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికే ఆర్టీసీ బస్సు సర్వీసులను ఆరు రోజులుగా రద్దు చేశారు. దసరా పండుగ వేళ బస్సులు లేక ప్రమాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఇలాకాలోనే అధికారుల పని తీరు ఇలా ఉందంటే మిగతా ప్రాంతాల పరిస్థితి ఏమిటని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదకరంగా గుంత

కోట్‌పల్లి మండల పరిధిలోని కొత్తపల్లి చెరువు సమీపంలో పీఆర్ రోడ్డుపై ఏర్పడిన గుంత ప్రమాదకరంగా మారింది. కోట్‌పల్లి నుంచి సుల్తాన్‌పూర్, బంట్వారం, తొర్మామిడి, కర్ణాటకలోని కుంచారంకు ఇదే మార్గంలో వెళ్లుంటారు. నిత్యం ఆటోలు, ద్విచక్ర వాహనాలు తిరుగుతుంటాయి. రాత్రి వేళ ఎవరైనా ఆదమరిస్తే ఇక అంతే సంగతులు. గుంతలో పడి గాయపడాల్సిందే. ఇప్పటికే పలువురు ప్రమాదాల బారినపడ్డారు. సంబంధిత పంచాయతీ రాజ్ అధికారులు స్పందించి సత్వరమే తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.